సాక్షి విశాఖపట్నం
గురువారం । 17 । అక్టోబర్ । 2024



విశాఖలో భారీ వర్షం

వాయుగుండం ప్రభావంతో బుధవారం నగరంలో పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. 8లో



ఇసుక లేదు.. ఇల్లూ లేదు

ఇసుక కొరత కారణంగా ఇళ్ల నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. రూ.వందల కోట్ల రియల్ వ్యాపారం పడకేసింది. 8లో



పొట్టేల్ పేరు వెనుక ఆసక్తి కథ

తెలంగాణ నేపథ్యంలో సాగే పొట్టేల్ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరోయిన్ అనన్య నాగళ్ల కోరారు. 8లో

టూర్.. టార్గెట్?



కార్పొరేటర్ల అధ్యయన యాత్ర కోసం హెచ్‌వోడీలపై ఒత్తిళ్లు

రూ.కోటి వసూలు చేసి ఇవ్వాలని కూటమి నేతల హుకుం

- కూటమి నేతల దెబ్బకు జీవీఎంసీ కాంట్రాక్టర్లు బెంబేలు
- అడిగినంత పర్సంటేజీలు ఇచ్చుకోలేమని గగ్గోలు
- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు కాంట్రాక్టర్ల ఫిర్యాదు?
- ఒక్కో కార్పొరేటర్‌కు రూ.1.19 లక్షలు చెల్లించేందుకు టెండర్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాలేదు.. కానీ కూటమి నేతల వసూళ్ల దెబ్బకు జీవీఎంసీ కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. ఇంత మొత్తం ఇవ్వాల్సిందేనని టార్గెట్లు విధించి మరీ వసూళ్లకు తెగబడిన వైనంపై కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. కూటమి కార్పొరేటర్లు డిమాండ్ చేసిన స్థాయిలో పర్సంటేజీలు ఇచ్చుకోలేమని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు విన్నవించుకోవాలని కొంత మంది కాంట్రాక్టర్లు నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ మేరకు ఎమ్మెల్యే అపాయింట్‌మెంట్ కోరినట్టు తెలిసింది. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో నామినేషన్‌పై చేసిన పనులకు 8 శాతం పర్సంటేజీని వసూలు చేస్తున్న నేతలు.. ఇప్పుడు మరింత తెగించి జీవీఎంసీలో చేపడుతున్న ప్రతి పనికీ పర్సంటేజీ కావాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వారు అడిగినంత పర్సంటేజీలు ఇస్తే తమకు గిట్టుబాటు అయ్యే అవకాశం లేదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. కూటమి నేతల ఒత్తిళ్లను తట్టుకోలేక విసిగిపోయిన కాంట్రాక్టర్లు.. నేరుగా ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

యాత్ర పేరుతో వసూళ్లు

జీవీఎంసీలో చేపడుతున్న పనులకు కాంట్రాక్టర్ల రక్తం పిండి మరీ వసూళ్లకు తెగబడిన నేతలు.. తాజాగా టూర్ పేరుతో అధికారులకు టార్గెట్ విధించినట్లు తెలుస్తోంది. అధ్యయన యాత్ర పేరుతో జీవీఎంసీ కార్పొరేటర్లు ఈ నెల 20వ తేదీన దక్షిణ భారతయాత్రకు సిద్ధమయ్యారు. ఈ టూర్‌కు అధికారికంగా జీవీఎంసీ ఖాతా నుంచి నిధులు వెచ్చిస్తున్నారు. అయితే దీనిపై కనీసం మేయర్‌కు సమాచారం ఇవ్వకుండా.. ఆమె అనుమతి తీసుకోకుండా టూర్ ప్రోగ్రాం సిద్ధం చేశారు. ముందస్తు అనుమతి ఇవ్వాలంటూ ఇప్పుడు ఏకంగా జీవీఎంసీ ఉన్నతాధికారే ఫైలు పంపడం చర్చనీయాంశమవుతోంది. కాగా.. టూర్‌లో తమ వ్యక్తిగత జల్సాల కోసమంటూ కూటమి నేత ఒకరు వివిధ శాఖల ఉన్నతాధికారులకు టార్గెట్లు విధించారు. అన్ని విభాగాలు కలిపి తమకు కోటి రూపాయలు వసూలు చేసి ఇవ్వాలంటూ లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిసింది. ప్రధానంగా ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఇందుకోసం గాజువాకకు చెందిన ఒక కార్పొరేటర్‌కు బాధ్యతలు అప్పగించారు.

గోవాలో గానాబజానా?



కార్పొరేటర్ల టూర్‌లో భాగంగా గోవాకు వెళుతున్న సంగతి తెలిసిందే. అక్కడ తనకు మద్దతిచ్చే కార్పొరేటర్లకు విందుతో పసందు చేసేందుకే కూటమిలోని ఓ నేత సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే అధికారులకు ఇంత మొత్తం ఇవ్వాల్సిందేనంటూ టార్గెట్లు విధించి మరీ వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ఎన్నడూ ఈ తరహా వసూళ్లు లేవని అధికారులు వాపోతున్నారు. ఎంతో కొంత అంటే ఓకేనని.. కచ్చితంగా ఇంత మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేయడం ఎన్నడూ లేదని అంటున్నారు. ఈ వ్యవహారంపై జీవీఎంసీ ఉన్నతాధికారికి ఇప్పటికే పలు విభాగాల అధికారులు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

ప్రజల సొమ్ముతో సోకులు

అధ్యయనం పేరుతో వివిధ ప్రాంతాలకు వెళ్లి అక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకోవడం, వాటిని ఇక్కడ అమలు చేయడం గతంలోనూ చూశాం. గతంలో ఉత్తర భారతదేశ యాత్ర కోసం ఒక్కొక్కరికి రూ.95 వేల ప్యాకేజీని మాత్రమే జీవీఎంసీ చెల్లించింది. అయితే ఈ సారి మాత్రం దక్షిణ భారతదేశ యాత్రకు ఒక్కొక్కరికి ఏకంగా రూ.1.19 లక్షల మేర చెల్లించేందుకు టెండర్ వేశారు. ఒక వైపు ప్యాకేజీ పేరుతో అదనంగా జీవీఎంసీపై భారం మోపిన కూటమి నేతలు.. టూర్‌లో విలాసాల కోసం వివిధ శాఖలకు టార్గెట్లు విధించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయం జీవీఎంసీ ఉన్నతాధికారి దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. మరి ఆయన చర్యలు తీసుకుంటారా? లేదా చూసీ చూడనట్టు వదిలేస్తారా? చూద్దాం.!

న్యూస్‌రీల్

టగ్ నిర్మాణానికి హెచ్‌ఎస్‌ఎల్‌తో వీపీటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న పోర్ట్, హెచ్‌ఎస్‌ఎల్ ప్రతినిధులు

విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ అవసరాలకు తగ్గట్టుగా బొలార్డ్ పుల్ టగ్ నిర్మించేందుకు హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్‌ఎస్‌ఎల్) సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పోర్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్, హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్ కమాండర్ గిరిదీప్ సింగ్ బుధవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా 60 టన్నుల సామర్థ్యం కలిగిన బొలార్డ్ పుల్ టగ్‌ను హెచ్‌ఎస్‌ఎల్ 18 నెలల్లో నిర్మించి పోర్టుకు అందించనుంది. అత్యాధునిక సాంకేతికతతో, పూర్తి భద్రతా ప్రమాణాలతో నిర్మించనున్న ఈ టగ్.. పోర్టు హార్బర్‌లో నౌకల కదలికలను సులభతరం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. అలాగే రానున్న రోజుల్లో కార్గో ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడంలోను సహాయపడనుంది.

'అగమ్య షిప్ ఫైర్ ఫైటింగ్ ట్రైనింగ్ ఫెసిలిటీ' ప్రారంభం



అగమ్య షిప్ ఫైర్ ఫైటింగ్ ఫెసిలిటీని ప్రారంభిస్తున్న వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా

సింధియా: ఐఎన్‌ఎస్ విశ్వకర్మలో అత్యాధునిక సదుపాయాలతో దేశీయంగా రూపొందించిన 'అగమ్య'షిప్ ఫైర్ ఫైటింగ్ ట్రైనింగ్ ఫెసిలిటీ అందుబాటులోకి వచ్చింది. దీనిని బుధవారం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా అందుబాటులోకి వచ్చిన కొత్త సదుపాయాలతో భారత నౌకాదళం అంతర్జాతీయ స్థాయిలో తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంది.

ఐటీఐని సందర్శించిన డైరెక్టర్ జనరల్



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ జనరల్(ట్రైనింగ్) త్రిషల్ జిట్ శెటి

కంచరపాలెం: కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని డైరెక్టర్ జనరల్(ట్రైనింగ్), స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ అడిషనల్ కార్యదర్శి త్రిషల్ జిట్ శెటి బుధవారం సందర్శించారు. ఆడియో రియాల్టీ(ఏఆర్), విజువల్ రియాల్టీ(వీఆర్)లో శిక్షణ పొందుతున్న వారి వివరాలను ఇక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఐటీఐలో ప్రతీ ల్యాబ్‌ను పరిశీలించిన ఆమె.. స్కిల్ ఇండియా అప్‌గ్రేడేషన్‌పై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ల్యాబ్‌ల్లో నూతన పరికరాలు, యంత్రాలను ఆమె ప్రారంభించారు. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, ఐఎంసీ చైర్మన్ బి.ఎస్.బి.ప్రభాకర్‌రావు, ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేష్ రాక

మహారాణిపేట: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయ్‌పూర్ నుంచి విమానంలో గురువారం రాత్రి 10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రామ్‌నగర్‌లో ఉన్న ఎన్టీఆర్ భవన్‌కు చేరుకొని రాత్రికి అక్కడ బస చేస్తారు. 18న వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి ఎన్టీఆర్ భవనకు చేరుకొని అక్కడ బస చేస్తారు.

రేపటి నుంచి ఏఐపై సదస్సు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 18, 19 తేదీల్లో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్), డేటా సైన్స్(డీఎస్)పై తెలుగులో చర్చా వేదికను నిర్వహిస్తున్నట్లు సదస్సు సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తెలిపారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల, ఐటీసీఏ విభాగాల ఆధ్వర్యంలో ఏఐసీటీఈ సహకారంతో నిర్వహించే ఈ సదస్సును ఏయూ వీసీ శశిభూషణరావు ప్రారంభిస్తారన్నారు. ఈ చర్చా వేదికలో నిపుణుల ప్రసంగాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటాయని వివరించారు. ఇందులో విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, బోధన సిబ్బంది, పరిశ్రమల నిపుణులు పాల్గొనవచ్చని సూచించారు.

మందకొడిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

ఇప్పటి వరకు 1500 దరఖాస్తులు..
నవంబర్ 6 తుది గడువు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోంది. ఇప్పటి వరకు 1500 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29తో పూర్తి అవుతుంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పాత ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోనందున గత నెల 30న కొత్త నోటిఫికేషన్ జారీ చేశారు. నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించి, అదే నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేస్తారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, ఆ నెల 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. సాధారణంగా ఉపాధ్యాయ సంఘాలు ఈ ఓటర్ల జాబితా నమోదులో ఉత్సాహం చూపుతాయి. ఈసారి వరుస సెలవులు, పండగలు, వర్షాల కారణంగా నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వచ్చాక నమోదు ప్రక్రియ ఊపందుకునే అవకాశాలున్నాయి.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం రూ.2.08 లక్షలు



విరాళం చెక్కును దేవస్థానం ఉద్యోగికి అందిస్తున్న దాత వెంకటనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పాత గాజువాక ప్రాంతానికి చెందిన జి.వెంకటనాయుడు రూ. 2,08,116 విరాళాన్ని బుధవారం అందించారు. పీఆర్వో కార్యాలయంలో సంబంధిత చెక్కుని సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

మద్యం దందా షురూ!

- తెరుచుకుంటున్న ప్రైవేట్ వైన్ షాపులు
- లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారికి చుక్కలు
- షాపులు దొరక్కుండా ఇబ్బందులు పెడుతున్న కూటమి నేతలు
- మద్యం స్టాకు విడుదల చేసుకున్నది కేవలం 94 మందే..
- వాటాల కోసం పలువురిపై ఒత్తిళ్లు
- నివాస ప్రాంతాల్లో లిక్కర్ షాపులపై ఫిర్యాదులు

విశాఖ సిటీ: కూటమి నేతల దౌర్జన్యానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. లాటరీలో వైన్‌షాపులు దక్కించుకున్న కొంత మందికి చుక్కలు చూపిస్తున్నారు. స్వతంత్రంగా మద్యం వ్యాపారం చేయాలనుకుంటున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లీజులకు షాపులు దొరక్కుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అప్పుడే కమీషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నట్లు కొంత మంది వ్యాపారులు వాపోతున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయి రెండు రోజులైనా ఇంకా కొందరు షాపుల వేటలోనే ఉన్నారు. ఫలితంగా వారు మద్యం స్టాకును విడిపించుకోలేదు.

155 షాపులకు ప్రొవిజనల్ లైసెన్సులు

విశాఖ జిల్లాకు 155 వైన్ షాపులను కేటాయించారు. వీటికి ఈ నెల 14న లాటరీ నిర్వహించారు. షాపులు దక్కించుకున్న వారందరూ లైసెన్స్ ఫీజులో 1/6 రుసుం చెల్లించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు వారికి ప్రొవిజనల్ లైసెన్సులు మంజూరు చేశారు. అయితే బుధవారం సాయంత్రం వరకు 94 మంది మాత్రమే మద్యం స్టాక్ విడిపించుకున్నారు. మిగిలిన వారు షాపుల వెతుకులాటలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. వారం రోజులకే ప్రొవిజినల్ లైసెన్సులు ఇవ్వడంతో.. ఈ లోగా షాపులు ఏర్పాటు చేసుకుని అధికారంగా వైన్‌షాపులు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. వారం రోజుల తర్వాత సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ సీఐలు స్వయంగా షాపులు పరిశీలించనున్నారు.



రైల్వే న్యూకాలనీలో కొత్తగా ఏర్పాటైన వైన్‌షాప్

కమీషన్ల కోసం ఒత్తిళ్లు

జిల్లాలో 155 మద్యం దుకాణాల్లో 120కి పైగా సిండికేట్ల చేతుల్లోనే ఉన్నాయి. ఒక్కో షాపునకు 3 నుంచి 10 దరఖాస్తులు వేయడంతో లాటరీలో వారికే అత్యధిక షాపులు దక్కాయి. కాగా.. స్వతంత్రంగా మద్యం వ్యాపారం చేయాలని దరఖాస్తు చేసుకుని లాటరీలో వైన్‌షాప్‌ను దక్కించుకున్న వారి ఆనందం ఆవిరయ్యేలా కూటమి ప్రజాప్రతినిధుల అనుచరులు రంగంలోకి దిగారు. వైన్‌షాప్ ప్రారంభించక ముందే ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు గెద్దల్లా వాలిపోతున్నారు. కమీషన్ల కోసం ఒత్తిళ్లు చేస్తున్నారు. తాము చెప్పినట్లు చేయని పక్షంలో షాపులు దొరక్కుండా చేస్తామని పలువురిని బెదిరించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు నడిచిన షాపులను ఇప్పటికే సిండికేట్లు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. కొందరు ఎక్సైజ్ అధికారుల సహాయ, సహకారాలతో లాటరీకి ముందే లీజులు చేయించేసుకున్నారు. దీంతో కొత్త వారికి ఆయా దుకాణాలు దొరికే అవకాశం లేకుండా పోయింది.

కలెక్టర్‌కు ఫిర్యాదులు

జిల్లాలో సగం కూడా మద్యం దుకాణాలు ఏర్పాటు కాలేదు. ప్రారంభమైన కొన్ని వైన్ షాపులపై అప్పుడే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారంటూ ఒకవైపు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో పాటు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఓల్డ్ సీబీఐ జంక్షన్‌లో రెసిడెన్షియల్ ప్రాంతంలో వైన్‌షాప్ ఏర్పాటు చేస్తున్నారంటూ స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. ఎక్సైజ్ అధికారులతో విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే 8వ వార్డు పరిధి సుభాష్‌నగర్, మిథిలాపురి వుడా కాలనీ సమీపంలోని వికలాంగుల కాలనీలో మద్యం షాపులు వద్దని స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ ఫిర్యాదులపై త్వరలోనే విచారిస్తామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఉంటే షాపుల ఏర్పాటుకు అనుమతి స్తామని పేర్కొంటున్నారు.

మద్యం షాపును అడ్డుకున్న టీడీపీ మహిళలు

కొమ్మాది: నూతన మద్యం పాలసీని ప్రజలే కాకుండా కూటమి నేతలూ వ్యతిరేకిస్తున్నారు. జీవీఎంసీ 8వ వార్డు పరిధి సుభాష్‌నగర్‌లో ఒక టీడీపీ నాయకుడికి మద్యం షాపు దక్కింది. ఆయన నివాసాల మధ్య వైన్ షాపు ప్రారంభించేందుకు బుధవారం ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ సమాచారం అందుకున్న టీడీపీ సీనియర్ నాయకురాలు ఎస్.మంగాదేవి ఇక్కడ వైన్‌షాప్ వద్దని అడ్డుకున్నారు. స్థానిక మహిళలతో సాయంత్రం అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. తక్షణమే మద్యం దుకాణాన్ని నిలిపి వేయాలని హెచ్చరించారు. నివాసాల మధ్య వైన్ షాప్‌నకు ఎలా అనుమతి ఇచ్చారంటూ అధికారులను నిలదీశారు. సొంత పార్టీ నాయకులే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించడంతో ఆ వ్యక్తి షాపును ప్రారంభించకుండానే వెనుదిరిగాడు. కాగా.. ఈ ఘటన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి వెళ్లింది. సొంత పార్టీ నాయకులే ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తే.. ప్రజలు పార్టీని ఎలా నమ్ముతారంటూ ఆయన మంగాదేవిని హెచ్చరించినట్లు తెలిసింది.



దుకాణాన్ని మూయిస్తున్న టీడీపీ నాయకురాలు మంగాదేవి, మహిళలు

జనావాసాల్లో వైన్ షాపు వద్దు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ సమీపంలోని వికలాంగుల కాలనీలోని నివాసాల చెంత వైన్‌షాపు ఏర్పాటు వద్దని కాలనీ వాసులు ధర్నాకు దిగారు. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన వైన్‌షాపు ముందు బుధవారం శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా ఆక్రమించి చికెన్ షాపునకు అద్దెకి ఇచ్చాడని ఆరోపించారు. దాని పక్కనే ఉన్న స్థలంలో నిర్మించిన ఇంటిని ఇప్పుడు వైన్‌షాపునకు అద్దెకు ఇచ్చాడని మండిపడ్డారు. ఈ విషయం అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ వైన్‌షాపును తక్షణమే వేరే చోటకి తరలించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేసి, దుకాణ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళనలో కాలనీ అధ్యక్షుడు కె.ప్రసాద్, కార్యవర్గ సభ్యులు బి.అనిల్, భూపాల్‌రెడ్డి, పూర్ణ చంద్రారెడ్డి, బీజేపీ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



దుకాణం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన కాలనీవాసులు

ఎస్‌సీఈఆర్‌టీ పోస్టులకు

నో చాన్స్!

- మున్సిపల్ టీచర్లకు అన్నింటా అవమానం
- వర్క్ అడ్జస్ట్‌మెంట్లోనూ తీవ్ర అన్యాయం
- విశాఖలో 900 మంది మున్సిపల్ ఉపాధ్యాయులు
- వారి సమస్యల్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం

విశాఖ విద్య: మున్సిపల్ ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తోంది. సర్వీసు పరమైన సమస్యలు పరిష్కరించకపోగా, ఎస్‌సీఈఆర్‌టీ వంటి ప్రాధాన్యత కలిగిన శిక్షణ సంస్థల్లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకూ అవకాశం కల్పించట్లేదు. బదిలీలు లేవు.. ప్రమోషన్లు రావు.. దీంతో తాము చేసిన పాపమేంటని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనర్హతపై అసంతృప్తి

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ)లో ప్రొఫెసర్, లెక్చరర్ వంటి 34 పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16 నుంచి 25 వరకు డీఈవో లేదా ఆర్జేడీ/డైట్ ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్ర స్థాయిలో పనిచేసే అవకాశం ఉన్న పోస్టులు కావటంతో వీటికి ఉపాధ్యాయుల్లో క్రేజ్ ఉంది. అయితే ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య టీచర్లే అర్హులని ప్రకటించి, మున్సిపల్ టీచర్లను విస్మరించారు. దీనిపై మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

బదిలీల్లేవు.. పదోన్నతులు రావు

మున్సిపల్ మేనేజ్‌మెంట్ కింద విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో(జీవీఎంసీ పరిధి) దాదాపు 900 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరికి కొన్నేళ్లుగా బదిలీలు లేవు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒకే చోట ఏళ్ల తరబడి పనిచేయాల్సి వస్తోందని, ఉద్యోగ విరమణ దశలోనూ తాము కోరుకున్న స్కూళ్లకు చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య ఉపాధ్యాయులు పదోన్నతులతో ముందుకెళ్తున్నారు. మున్సిపల్ టీచర్లు మాత్రం చాలా మంది పదోన్నతి లేకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

సర్దు'పోటు'

ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖాధికారులు తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు మున్సిపల్ టీచర్లకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. విశాఖ నగరంలోని ఓ మున్సిపల్ స్కూల్లో వచ్చే డిసెంబర్‌లో ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయుడిని సైతం మిగులుగా చూపించి, వేరే స్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. ఇలాంటి నిర్ణయాలపై మున్సిపల్ టీచర్లు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన, సత్యాగ్రహ దీక్షలూ చేశారు. అయినా విద్యాశాఖాధికారులు పట్టించుకోలేదు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మున్సిపల్ టీచర్లకు మేలు చేయాలనే తలంపుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీరిని విద్యాశాఖ పరిధిలోకి తీసుకొచ్చింది. ఈలోగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీరి సమస్యల్ని గాలికొదిలేసింది. ప్రతి నెలా వేతనంలో మినహాయిస్తున్న పీఎఫ్ నిధులు వ్యక్తిగత ఖాతాలకు జమ కావట్లేదు. మరణించిన ఉపాధ్యాయులకు రావాల్సిన పరిహారం కోసం నానా అగచాట్లు. విద్యాశాఖతో పాటు, జీవీఎంసీ కమిషనర్ నుంచి సైతం ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాల్సిన దుస్థితి. ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల నిబంధనలే తమకూ వర్తింపజేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



మున్సిపల్ టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే ఉన్నతాధికారులకు పలు మార్లు వినతి పత్రాలిచ్చాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. లేకుంటే యూటీఎఫ్ పక్షాన కలిసొచ్చే సంఘాలతో ఉద్యమానికి సిద్ధమవుతాం.

– టీఆర్ అంబేడ్కర్, జిల్లా కార్యదర్శి, యూటీఎఫ్

మున్సిపల్ టీచర్లకూ అవకాశమివ్వాలి



మున్సిపల్ టీచర్ల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి. మున్సిపల్ యాజమాన్యంలో ఉద్యోగోన్నతులు లేకుండానే అనేకమంది రిటైర్ అవుతున్నారు. అయినా ప్రభుత్వం స్పందించటం లేదు. ఎస్‌సీఈఆర్‌టీ పోస్టుల్లో మున్సిపల్ టీచర్లకు అవకాశం కల్పించాలి.

– కొమ్మనాపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి, పీఆర్‌టీయూ

ఇదేం ఖర్మ మాకు



ఏ చట్టం లేని విభజన రూల్స్ మున్సిపల్ టీచర్లకు వర్తించటం అన్యాయం. ఏళ్ల తరబడి బదిలీలు లేవు, ప్రమోషన్లు లేవు. జీపీఎఫ్ ఖాతాలు కూడా మాకు లేవు. ఉన్నత ఉద్యోగాల్లో అవకాశాలు ఇవ్వట్లేదు. ఇదేం ఖర్మ మాకు. ఇప్పటికైనా పాలకులు మా గోడు పట్టించుకోవాలి.

– ఎం.రవిసిద్ధార్థ, రాష్ట్ర కార్యదర్శి, ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్

క్లుప్తంగా

మాస్టర్‌ప్లాన్ రోడ్ల పనులు చేపట్టండి



వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో చర్చిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాఖ సిటీ: విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అవకాశం ఉన్న చోట బృహత్తర ప్రణాళిక రహదారులను ప్రాధాన్యక్రమంలో గుర్తించి సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని ఎంపీ శ్రీభరత్ వీఎంఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. బుధవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. నగరం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అంతర్గత రహదారులను ప్రధాన రహదారులకు అనుసంధానించాలని చెప్పారు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలన్నారు. జాయింట్ కమిషనర్, కార్యదర్శి కె.రమేష్, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, కార్యనిర్వహక ఇంజినీర్ బలరామరాజు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణించిన బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగిని



మెడల్స్ సాధించిన మీనాకుమారి

డాబాగార్డెన్స్: బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగి, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా మహిళా సెక్రటరీ మీనాకుమారి అథ్లెటిక్స్‌లో రాణించారు. ఆలిండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో, లాంగ్‌జంప్‌లో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మీనాకుమారిని అభినందించారు. యూనియన్‌కు ఎంతో గర్వకారణమని యూనియన్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ పీఈసీ హెచ్‌వీ సాగర్ తెలిపారు.

ఇసుక పని ఇల్లూ లేదు..



మధురవాడకు చెందిన రమేష్ ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. పిల్లర్లు వేసేశారు. పునాదులు తవ్వేశారు. ఇక గోడలు కట్టి.. శ్లాబు వేసేసి సొంతింటికి షిఫ్ట్ అవ్వడమే తరువాయి అనుకున్నాడు. ఇంతలో ప్రభుత్వం మారింది. ఇసుక దొరకడం గగనమైపోయింది. దీంతో ఇంటి నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది.

కూటమి ప్రభుత్వం ఇసుక ఫ్రీగా అందిస్తామని ప్రకటించడంతో గాజువాకకు చెందిన రత్నాకర్ అనే బిల్డర్ అగనంపూడిలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి పూనుకున్నాడు. ఇసుక ఎలాగూ ఫ్రీగానే దొరుకుతుంది కదా అని.. చ.అడుగు తక్కువ ధరకే ఇస్తామని.. ఏడాదిన్నర లోపు ఫ్లాట్ అప్పగిస్తామని ప్రకటించడంతో హాట్ కేక్‌లా ఫ్లాట్లు అమ్ముడుపోయాయి. ఇప్పుడేమో ఇసుక దొరక్కపోవడం.. బ్లాక్‌లో అధిక ధరకు విక్రయిస్తుండటంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిపోయింది. కొనుగోలుదారులకు రేటు పెంచుతున్నట్లు చెబితే ఒక్క రూపాయి కూడా చెల్లించబోమని.. చెప్పిన టైమ్‌కి ఫ్లాట్ ఇవ్వకపోతే కేసు పెడతామని హెచ్చరిస్తున్నారు. ఏం చేయాలో తెలియక బిల్డర్ విలవిల్లాడుతున్నాడు.

- జిల్లాలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- మొత్తం 20 లక్షల టన్నుల ఇసుక అత్యవసరం
- బ్లాక్‌లో అక్రమ అమ్మకాలకు తెర తీసిన కూటమి నేతలు
- ఇసుక దొరక్క గృహ నిర్మాణదారుల అగచాట్లు
- పనుల్లేక పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులు



సాక్షి, విశాఖపట్నం: ఇసుక కొరత కారణంగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. రూ.వందల కోట్ల రియల్ వ్యాపారం పడకేసింది. సరికొత్త విధానమంటూ కూటమి ప్రభుత్వం ప్రజల కంట్లో కొట్టిన ఇసుక.. నలుసుగా మారి ఇబ్బందులకు గురిచేస్తోంది. కొత్తింటి కలని నాశనం చేస్తోంది. ఇదే అవకాశంగా అధికార పార్టీకి చెందిన నేతలు ఇసుక దందాను కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బ్లాక్‌లో ఇసుక విక్రయిస్తూ దొరికినకాడికి దోచుకుంటున్నారు. మరోవైపు నిర్మాణ పనుల్లేక కార్మికులు విలవిల్లాడుతున్నారు.

గత ప్రభుత్వం నిల్వ చేసిన ఇసుకే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వర్షాకాలంలో ఇసుక తవ్వకాలకు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ముందుచూపుతో వ్యవహరించింది. ఈ ఏడాది జనవరి నెలలోనే భీమిలి డిపోలో 39,800 టన్నులు, అగనంపూడి డిపోలో 63 వేల టన్నులు ఇసుక నిల్వ ఉంచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇసుకను విక్రయించింది. ఇసుక ఫ్రీ అంటూనే 20 టన్నులకు రూ.18 వేలకు పైగా ముక్కు పిండి మరీ వసూలు చేసింది. సెప్టెంబర్ 20 నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్స్ ప్రారంభించి శ్రీకాకుళం, రాజమండ్రి రీచ్‌ల నుంచి మరో 7 వేల టన్నులు మాత్రమే సరఫరా చేసింది. అంతే కాకుండా బ్లాక్‌లో ఇసుక అమ్మకాలకు టీడీపీ, జనసేన నేతలు తెరతీయడంతో ఇసుక దొరకడం గగనమైపోయింది.

ఇసుకే బంగారమాయేనా.?

ఇసుక ఫ్రీ అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ఇసుక ఎలా ఉంటుందో జనాలకు చూపించలేని దుస్థితికి తీసుకొచ్చేసింది. ఇసుక లేక జిల్లాలోని భీమిలి, అగనంపూడి డిపోలు మూతపడ్డాయి. రాజమండ్రి, శ్రీకాకుళం నుంచి నేరుగా ఇసుక కొనుగోలు చేస్తుంటే తడిసి మోపడవుతుంది. దీంతో ఇసుక కొనేందుకు నిర్మాణదారులు భయపడుతున్నారు. అవసరమైతే ఇళ్ల నిర్మాణాలు ఆపేసి.. తర్వాత ఎప్పుడైనా కట్టుకుందామనే ఆలోచనలో ఉన్నారు. దీంతో నిర్మాణ రంగం జిల్లాలో పడకేసింది.

పనుల్లేక.. అప్పులకు వడ్డీ చెల్లించలేక..

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రియల్ రంగం పడకేసింది. పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు విలవిల్లాడుతున్నారు. కూలీలు రోజూ జంక్షన్‌కు రావడం.. 11 గంటల వరకూ వేచి చూడటం.. తర్వాత పనులు లేవని తెలిసి ఉసూరంటూ ఇంటి బాటపట్టడం నిత్య కృత్యంగా మారిపోయింది. కొందరు వలస కూలీలు నగరంలో పని దొరక్క సొంతూళ్లకు పయనమవుతున్నారు. పల్లెల్లో ఉంటే పొలం పనులైనా దొరుకుతాయని భావిస్తూ వెళ్లిపోతున్నారు. మరోవైపు రియల్ వ్యాపారులు కూడా కుదేలైపోతున్నారు. నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో నిలిపేయడంతో.. వ్యాపారాలు లేక.. బ్యాంకు నుంచి తీసుకున్న లోన్లకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిపోయిన 2 లక్షల ఇళ్లు

జిల్లాలో రియల్ వ్యాపారుల అంచనాల మేరకు 2 లక్షల ఇళ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో ఇండివిడ్యువల్ ఇళ్ల నిర్మాణాలు 30 శాతం వరకూ ఉండగా.. అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీస్, గ్రూప్ హౌస్‌లు 70 శాతం వరకూ ఉన్నాయి. వీటన్నింటికీ ఇసుక కొరత వేధిస్తుండటంతో అర్ధాంతరంగానే పనులు నిలిచిపోయాయి. ఈ రెండు లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు 20 లక్షల టన్నుల ఇసుక అవసరం. కానీ.. గత ప్రభుత్వ హయాంలో నిల్వ చేసిన లక్ష టన్నుల ఇసుకని మాత్రమే ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వం విక్రయించగలిగింది. ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇసుక రేణువు కూడా దొరకని దుస్థితి నెలకొంది.

పనుల్లేక పస్తులుంటున్నాం



నేను శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం నుంచి 25 ఏళ్ల క్రితం గాజువాక వలస వచ్చాను. పెదగంట్యాడ మండలం దయాల్‌నగర్‌లో భార్య ఇద్దరు కూమార్తెలతో నివాసం ఉంటున్నాను. భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఇసుక కొరత వల్ల గత మూడు నెలలుగా పని దొరకడం లేదు. కూలి క్లేగాని పూట గడవని పరిస్థితి మాది. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. పిల్లల ఫీజులకూ ఇబ్బంది పడుతున్నాం.

– సీహెచ్ జనార్దన్, భవన నిర్మాణ కార్మికుడు, దయాల్‌నగర్, పెదగంట్యాడ

సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు..



పేరుకే ఉచిత ఇసుక అంటున్నారు తప్పా ఎక్కడా దొరకడం లేదు. బ్లాక్‌లో ఇసుక ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇసుక కొనలేక కొందరు, ఇసుక సక్రమంగా దొరకక మరి కొందరు పనులు ఆపేస్తున్నారు. కొంద రైతే పనులు కూడా మొదలు పెట్టడం లేదు. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు దొరకకపోవడంతో చాలా మంది సొంతూళ్లకు వెళ్లి వ్యవసాయ కూలి పనులు చేసుకుంటున్నారు. నిర్మాణ రంగం బాగున్నప్పుడు వస్తామంటున్నారు.

–వైఎస్ మూర్తి, శ్రీ దుర్గా భవానీ భవన నిర్మాణ శ్రామిక సంఘం అధ్యక్షుడు, మధురవాడ

నిర్మాణాలు నిలిచిపోయాయి

ఇసుక కొరత కారణంగా మధురవాడ, సాగర్‌నగర్, ఎంవీపీ కాలనీల్లో ప్రారంభించిన నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇసుకను బ్లాక్‌లో కొందామంటే నిర్మాణంపై ఆర్థిక భారం పెరిగిపోతుంది. ఇసుక రేట్లు పెంచినప్పటికీ అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం. దీని కారణంగా మా దగ్గర పనిచేస్తున్న సుమారు 150 కుంటుంబాలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఒప్పందం ప్రకారం కొనుగోలుదారులకు దసరాకు నిర్మాణాలు అందించాల్సి ఉంది. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు, ఇసుక కొరత వల్ల ఈ మూడు ప్రాంతాల్లో నిర్మాణాలూ నిలిచిపోయాయి. కొనుగోలుదారులను బతిమాలి మరో ఆరు నెలల గడువు అడిగాం.

–కె.పి.నాయుడు, బిల్డర్, కొమ్మాది

గండి బాబ్జీ నుంచి మా స్థలాల్ని కాపాడండి

ఈ.మర్రిపాలెం లే అవుట్ వద్ద బాధితుల ఆందోళన



లేఅవుట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

పరవాడ: ఈ.మర్రిపాలెంలో తాము కొనుగోలు చేసుకున్న ఇళ్ల స్థలాలను టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతూ బాధితులు సదరు ప్రైవేట్ లేఅవుట్ వద్ద బుధవారం ఆందోళన దిగారు. బాబ్జీకి వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్‌లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఆందోళన కార్యక్రమంలో బాధితుడు సాంబశివరావు మాట్లాడుతూ ఈ.మర్రిపాలెం రెవెన్యూ పరిధిలో 2012లో సర్వే నెం.15, 16/1లో రెండు విడతలుగా ఐదెకరాల స్థలాన్ని కొనుగోలు చేసి లేఅవుట్ వేశామన్నారు. అన్ని రకాల ఫీజులు చెల్లించి సదరు స్థలాన్ని 80 మందికి విక్రయించినట్లు పేర్కొన్నారు. ఇదిలావుండగా పది రోజుల క్రితం టీడీపీ నేత గండి బాబ్జీకి చెందిన అనుచరులు కొంత మంది తమ లేఅవుట్‌లోకి అక్రమంగా చొరబడి, రాతి గోడను ధ్వంసం చేసి, దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేసి కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. బాధితులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తామంతా అప్పులు చేసి దాచుకొన్న డబ్బుతో కొనుగోలు చేసుకున్న ఇళ్ల స్థలాలను బాబ్జీ అనుచరుల కబ్జా నుంచి కాపాడాలని వేడుకున్నారు. ఈ స్థలాలపై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. గండి బాబ్జీ అనుచరులపై చర్యల కోసం పరవాడ పోలీసులకు, తహసీల్దార్‌కు గతంలోనే ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ పెద్దలు కల్పించుకుని టీడీపీ నేత బాబ్జీ అనుచర వర్గం నుంచి తమ స్థలాలను కాపాడాలని కోరారు. ఆందోళన కార్యక్రమంలో బాధితులు కృష్ణప్రసాద్, వెంకటపతి రాజు, సీత, కృష్ణారావు, పెదిరెడ్ల అప్పారావు, నాగరత్నం, ధనలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో అనుసంధానం చేయండి

ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డీజీ సూచన



ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: పరిశ్రమలతో యువతను అనుసంధానం చేస్తూ వారిలో ఉపాధి నైపుణ్యాలు పెంపునకు కృషి చేయాలని ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ విభాగం డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ సూచించారు. ఏయూను బుధవారం సందర్శించిన ఆయన.. వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులతో సమావేశమయ్యారు. కాలానుగుణంగా ఉపాధి సృష్టించే నూతన కోర్సులకు రూపకల్పన చేయాలన్నారు. ఏయూలో డ్రోన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వీసీ మాట్లాడుతూ ఇండస్ట్రీ 4.0 లేబొరేటరీని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వ మైటీ శాఖతో కలిసి వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన దిశగా పని చేస్తున్నామని వెల్లడించారు. ఫుడ్, ఫార్మా టెస్టింగ్ లేబొరేటరీని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఏయూ త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనుందని.. పూర్వవిద్యార్థుల భాగస్వామ్యం, సహకారం, సూచనలు స్వీకరిస్తామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్సిటీలో 64 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. అనంతరం మాదిరెడ్డి ప్రతాప్‌ను ఏయూ తరపున సత్కరించి జ్ఞాపిక అందజేశారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, సురేష్ బేత తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో భారీ వర్షం

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో బుధవారం నగరంలో పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్ల మీద వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల రోడ్లపై చెట్లు కూలాయి. గురువారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయండి

స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జల వనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించలేదని.. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నప్పటికి కొత్త గృహాలు మంజూరు కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం కూడా జరుగుతుందని అధికారులు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్పీటీసీలకు సమాచారం ఇవ్వాలన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కార్యక్రమంపై దృష్టి సారించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే జల్ జీవన్ మిషన్ ద్వారా పెండింగ్ కనెక్షన్లు, కొన్ని ప్రాంతాల్లోని ఇతర సమస్యలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి లేవనెత్తిన ప్రశ్నకు బదులిస్తూ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన దాదాపు 95 శాతం వరకు పింఛన్లు పంపిణీ జరుగుతోందని, అందుబాటులో లేని వారికి మరుసటి రోజున అందజేస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లకు ప్రతిపాదనలు ఇవ్వండి

గ్రామాల్లో రోడ్ల మరమ్మత్తులు, కొత్త రోడ్ల కోసం ప్రతిపాదనలు ఇవ్వాలని జెడ్పీ సీఈవో నారాయణమూర్తి కోరారు. మండల స్థాయిలో రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు, జిల్లా స్థాయిలో రోడ్ల కోసం జెడ్పీ నిధుల నుంచి ఖర్చు చేస్తామన్నారు. కోరం లేని కారణంగా నాల్గవ స్థాయీ సంఘం సమావేశం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

వివాహానికి లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా ఘటన



పీఎంపాలెం: వివాహానికి లైటింగ్ ఏర్పాటు చేస్తూ ఓ యువకుడు మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. రేవళ్లపాలేనికి చెందిన బెవర సరస్వతి భర్త కొన్నేళ్ల కిందట మరణించడంతో ఇంటి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులతో నివసిస్తున్నారు. పెద్దబ్బాయి అనిల్ కుమార్ వలంటీర్‌గా పని చేస్తూ ఎన్నికల ముందు రాజీనామా చేశాడు. చిన్న కుమారుడు బెవర సాయికుమార్(22) కొమ్మాది దేవిమెట్ట ప్రాంతానికి చెందిన ఈవెంట్ మేనేజర్ వద్ద పని చేస్తున్నాడు. కొమ్మాది గ్రామంలో బుధవారం రాత్రి ఓ వివాహ వేడుకలకు సంబంధించి లైటింగ్ ఏర్పాటు చేస్తున్నాడు. సాయంత్రం భారీ వర్షం కురిసిన తర్వాత వివాహ వేదిక వద్ద కరెంటు వైర్లు కలుపుతుండగా షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. ఈవెంట్ మేనేజర్, స్థానికులు వైద్యం నిమిత్తం దగ్గర్లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసు లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డాప్లర్ పరిజ్ఞానంతో నాడీ రుగ్మతలకు మెరుగైన వైద్యం



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: నాడీ సంబంధ రుగ్మతలను డాప్లర్ పరిజ్ఞానం ద్వారా నయం చేయవచ్చని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు అన్నారు. నేషనల్ న్యూరాలజీ కాన్ఫరెన్స్ ఒక హోటల్లో బుధవారం ప్రారంభమైంది. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన తర్వాత రోగికి నాలుగు లేదా అయిదు గంటల వ్యవధిలో ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా మరణాల నుంచి నివారణ పొందవచ్చన్నారు. నరాల సమస్య లేదా కండరాల సమస్య, నాడీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న రోగులను అంచనా వేయడం కష్టంతో కూడుకున్న పని అన్నారు. తలనొప్పి, మైగ్రేన్ తదితర వాటిపై కూడా చర్చ సాగింది. న్యూరాలజీలో విభిన్న ఆసక్తికరమైన అంశాలపై చర్చ సాగింది. రోగుల మెడ, మెదడులో మూసుకుపోయిన నాళాల నుంచి గడ్డలను తొలగించడానికి వైద్య పరికరాలను ఉపయోగించే విధానంపై ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ అఖి ల భారత అధ్యక్షుడు డాక్టర్ దేబాశిష్ చౌదరి, కార్యదర్శి డాక్టర్ యు.మీనాక్షి సుందరం, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.గోపి పాల్గొన్నారు.

పొట్టేల్ పేరు వెనుక ఆసక్తి కథ

- హీరోయిన్ అనన్య నాగళ్ల
- విశాఖలో చిత్ర యూనిట్ సందడి

బీచ్ రోడ్డు: తెలంగాణ నేపథ్యంలో సాగే పొట్టేల్ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని చిత్ర హీరోయిన్ అనన్య నాగళ్ల కోరారు. పొట్టేల్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా బస్సు యాత్ర నిర్వహించిన యూనిట్ బుధవారం సాయంత్రం విశాఖకు చేరుకుంది. బీచ్‌రోడ్‌లో హీరోయిన్ అనన్య నాగళ్ల విలేకరులతో మాట్లాడుతూ పొట్టేల్ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందన్నారు. ఇప్పటివరకు తాను చేసిన చిత్రాల కంటే భిన్నంగా ఈ చిత్రం ఉంటుందన్నారు. ఈ చిత్రానికి పొట్టేల్ అనే పేరు పెట్టడం వెనుక ఎంతో ఆసక్తికరమైన కథనం ఉంటుందన్నారు. ఈనెల 25న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. హీరో యువన్ కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. చిత్రంలో సీనియర్ నటుడు అజయ్ పాత్ర ప్రేక్షకులను కట్టిపడేస్తుంన్నారు. నటుడు నోయల్ మాట్లాడుతూ ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులకు అమితంగా నచ్చుతుందని తెలిపారు. దర్శకుడు సాహిత్ మొతుకూరి చిత్రాన్ని అద్భుతంగా తీశారన్నారు. చిత్ర సహనిర్మాత నిశాంక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందన్నారు.

వర్సిటీలో టపాసుల దుకాణాల ఏర్పాటు చేస్తే మీకేం నష్టం?

జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌ను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఏయూలో దీపావళి సందర్భంగా టపాసుల విక్రయాల దుకాణాలు ఏర్పా టు చేయకుండా అడ్డుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. జనావాసాలకు దూరంగా ఉన్న చోట టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేస్తే తప్పేముందని ప్రశ్నించింది. ఆ దుకాణాలను కేవలం దీపావళి సందర్భంగా మాత్రమే ఏర్పాటు చేస్తున్నారని గుర్తు చేసింది. అక్కడ టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వచ్చిన ఇబ్బంది ఏమీ లేదంది. దీని వల్ల మీకొచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే వాటిని దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమ లపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.